

విజయ డెయిరీ.. బకాయిల వర్రీ



వెల్దండలో పాలు పితుకుతున్న రైతు

- పాడి రైతులకు ఐదు నుంచి ఆరు బిల్లులు పెండింగ్
- ఉమ్మడి పాలమూరులో దాదాపు రూ. 45 కోట్ల బకాయి
- 2020 నుంచి ప్రోత్సాహకం పెండింగ్ కూడా రూ.కోట్లలో..
- పాల ఉత్పత్తుల అమ్మకాల్లేవని సాకులు చెబుతున్న ప్రభుత్వం
- పాలు రోడ్ల మీద పారబోసి నిరసన తెలుపుతున్న రైతులు

● నాగర్‌కర్నూలు జిల్లాలో గతేడాది వరకు సుమారు 70 వేల నుంచి 80 వేల లీటర్ల వరకు పాల సేకరణ జరిగేది. ఈ ఏడాది అది 96 వేల లీటర్లకు పెరిగింది. పాలు, పాల ఉత్పత్తులకు మార్కెట్‌లో ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. కానీ, ప్రైవేటు డెయిరీలతో ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీ పోటీ పడలేకపోతోంది. ఉత్పత్తులను విక్రయించలేకపోవడమే సంస్థ పతనానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. మహబూబ్‌నగర్ జిల్లాలో దాదాపు 1200 మంది రైతులు 36 వేల లీటర్ల వరకు రోజూ విక్రయిస్తున్నారు. ఈ జిల్లాలో దాదాపు రూ.ఏడు కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గద్వాల జిల్లాలో 250 మంది రైతులు రోజుకు వెయ్యి లీటర్లు విక్రయిస్తుండగా ఇక్కడ రూ. 40 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వనపర్తి జిల్లాలో 400 మంది రైతులు 3 వేల లీటర్ల వరకు విక్రయిస్తుండగా రూ. 80 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

....

● ఉమ్మడి పాలమూరుతో పాటు అన్ని జిల్లాల్లోనూ విజయ డెయిరీకి పాలు విక్రయిస్తున్న రైతులకు ఐదు నుంచి ఆరు బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయి. అదే ప్రైవేటు డెయిరీలకు విక్రయిస్తున్న వారికి ప్రతీ 15 రోజులకు టంఛనుగా బిల్లులు వస్తున్నాయి.

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పాడిపరిశ్రమ అభివృద్ధి, వినియోగదారులకు స్వచ్ఛమైన పాలు, పాల ఉత్పత్తులను అందించడానికి ఏర్పడిన విజయ డెయిరీ రోజురోజుకూ ప్రాభవం కోల్పోతోంది. ఇప్పటికే పలు జిల్లాల్లో రైతులు ప్రైవేటు డెయిరీలకు పాలు విక్రయిస్తుండగా చాలా మంది సమీప పట్టణాలు, నగరాల్లో హోమ్ డెలవరీ చేస్తున్నారు. ఒకప్పుడు పాల సేకరణలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్న విజయ డెయిరీ ప్రస్తుతం పాలు విక్రయిస్తున్న రైతులకు సమయానికి బిల్లులు చెల్లించలేని దయనీయ స్థితికి చేరుకున్నది.

ఇప్పటి వరకు ఆరు విడతల పాల బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయి. పాడి రైతులు విజయ డెయిరీ అధికారులను ప్రశ్నిస్తే కేవలం పాల ఉత్పత్తుల అమ్మకాలు సరిగ్గా జరగడం లేదని, అందుకే బిల్లులు చెల్లించడం లేదని బదులిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. ఒక్క ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఐదు నుంచి ఆరు బిల్లులకు సంబంధించి సుమారు రూ. 45 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్రంలో విజయ డెయిరీ పాలసేకరణలో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉండగా నాగర్‌కర్నూలు జిల్లా రెండో స్థానంలో ఉన్నది. ఇక్కడ సుమారు 9210 మంది రైతులు రోజుకు సుమారు 96 వేల లీటర్లను విక్రయిస్తున్నారు. ఆవు పాలకు గరిష్ఠంగా వెన్న శాతాన్ని బట్టి రూ. 45 వరకు, గేదె పాలకు వెన్నశాతాన్ని బట్టి రూ. 80 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ప్రతీ 15 రోజులకు ఒకసారి ఈ బిల్లులను చెల్లించాల్సి ఉండగా రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత నుంచి ఐదు నుంచి ఆరు బిల్లులను ఎప్పుడూ పెండింగ్‌లో ఉంచుతున్నారు. దీనివల్ల రైతులకు పశుపోషణ అనేది భారంగా మారింది. గతంతో పోల్చితే కొన్ని జిల్లాల్లో పాల ఉత్పత్తిని రైతులు ఇష్టంగా చేపడుతున్నారు. పలువురు యువకులు కూడా పాడి పరిశ్రమను ఆదాయ వనరుగా ఎంచుకొని డెయిరీలు తెరుస్తున్నారు.

మూడు నెలలుగా క్రమంగా రావడం లేదు



మూడేళ్ల నుంచి నేను విజయ డెయిరీకి పాలు పోస్తున్నాను. గతంలో పాల బిల్లులు ప్రతీ నెలలో 15వ తేదీ, 30వ తేదీ ఇచ్చేవారు. ప్రస్తుతం మూడు నెలల నుంచి సరిగా బిల్లులు రావడం లేదు. నాకు 15 రోజులకు రూ. 15 వేల వరకు బిల్లు వస్తుండేది. దాదాపు ఐదు బిల్లులు రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. అలాగే గతంలో ఇచ్చే రూ. 4 ప్రోత్సాహకాన్ని కూడా తిరిగి ప్రారంభించాలి. పెండింగ్ బిల్లులను ప్రభుత్వం త్వరగా ఇప్పించాలి.

- పి.శ్రీశైలం, నందిగామ, మహబూబ్‌నగర్

ఆదాయంలో సగం పశువుల పోషణకే ఖర్చు

ప్రస్తుతం హెచ్‌ఎఫ్ (హోలిస్టీన్ ఫ్రీజియన్), జెర్సీ ఆవులను పాడి రైతులు ఎక్కువగా పోషిస్తున్నారు. జెర్సీ ఆవులు 15 నుంచి 20 లీటర్లు రోజుకు ఇస్తుండగా, హెచ్‌ఎఫ్ ఆవులు 25 లీటర్ల వరకు ఇస్తుంటాయి. వీటి పోషణకు వచ్చే ఉత్పత్తి ద్వారా వచ్చే ఆదాయంలో సగం వెచ్చించాల్సిన పరిస్థితి ఉంటుంది. పల్లి చెక్క, పత్తి చెక్క, గోధుమ తవుడు, మక్కపిండి, మినరల్ మిక్షర్, క్యాల్షియం అందించాల్సి ఉంటుంది. ఒక్కో ఆవును రూ. లక్ష నుంచి రూ. 1.50 లక్షల వరకు ఖర్చు చేసి కొనుగోలు చేస్తున్న రైతులు బిల్లులు రాకపోవడంతో పోషణ భారంగా మారుతోందని ఆందోళన చెందుతున్నారు. దాదాపు ఆరు బిల్లులు పెండింగ్‌లో ఎప్పుడూ లేవని, పాల ఉత్పత్తిదారుల సొసైటీల్లో దాచుకున్న పొదుపు చేసుకున్న కొద్ది మొత్తాన్ని కూడా ఇప్పుడు ఖర్చు చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. దాణా ఖర్చులకు కూడా డబ్బులు లేకపోవడంతో పాడి రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే చాలా జిల్లాల్లో రైతులు పూర్తిగా విజయ డెయిరీకి పాలు పోయడం నిలిపివేయగా కొన్ని జిల్లాల్లో మాత్రమే పాల సేకరణ బాగా జరుగుతోంది. ఈ బిల్లుల బకాయిలు ఇలాగే ఉంటే వారు కూడా ప్రైవేటు డెయిరీలకు మారిపోవడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

దాణ కొనలేకపోతున్నా..



నాకు ఆరు ఆవులు ఉన్నాయి. ప్రతీరోజు 65 లీటర్ల వరకు పాలు కేంద్రానికి పోస్తుంటాను. ప్రతీ బిల్లుకు సుమారు రూ. 30 వేల వరకు రావాలి. ఐదు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. రూ. 1.50 లక్షల వరకు రావాలి. బిల్లులు రాకపోవడంతో దాణా సంచులు కొనుగోలు చేయలేకపోతున్నాను. కనీసం ఇంటి కిరాయిలు, పిల్లల ఫీజులు కూడా చెల్లించలేకపోతున్నాం. రూ. లక్షలు పెట్టి ఆవులు కొనుగోలు చేస్తే ఇప్పుడు పోషణ ఇబ్బందిగా మారింది.

- కునపురి అల్వాల్, పాడి రైతు, వెల్దండ, నాగర్‌కర్నూలు జిల్లా



వెల్దండలోని సేకరణ కేంద్రంలో పాలు పోస్తున్న రైతు

ప్రోత్సాహం సున్నా...

రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లో 2016లో అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల బాగు కోసం లీటర్ పాలపై రూ. 4 ప్రోత్సాహం అందించే పథకానికి శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత 2020 వరకు ఈ పథకం ద్వారా ప్రోత్సాహం రైతులకు అందింది. ఇటు పాల డబ్బులు విడతల ప్రకారం వస్తుండటం, అటు లీటర్‌పై రూ. 4 అదనంగా వస్తుండటంతో చాలామంది వ్యవసాయానికి అనుబంధంగా ఆవులను కర్ణాటక నుంచి హెచ్‌ఎఫ్, జెర్సీ ఆవులను తీసుకు వచ్చి పోషణ చేపట్టారు. కానీ, 2020 నుంచి ఆ ప్రోత్సాహం ఆగిపోయింది. 2024 ప్రారంభం నుంచి ప్రతీ 15 రోజులకు ఒకసారి బిల్లులు రావడం కూడా ఆగిపోయింది. ప్రభుత్వ రంగ సంస్థకు ప్రోత్సాహం లేకపోవడంతో పాడి రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కేవలం ఈ ప్రోత్సాహం డబ్బులే దాదాపు రూ. 50 కోట్ల వరకు పెండింగ్‌లో ఉంటాయని అంచనాలు ఉన్నాయి. ఇప్పుడు పాల బిల్లులు రాకపోవడంతో రైతులు రోడ్లపైకి వచ్చి నిరసన తెలుపుతున్నారు. ప్రజావాణిలో కలెక్టర్లకు ఫిర్యాదు చేయడంతో పాటు.. రహదారులపై పాలు పారబోసి నిరసన తెలుపుతున్నారు. త్వరలో ఉమ్మడి జిల్లాలోని పాల ఉత్పత్తిదారులు విజయ డెయిరీని ముట్టడించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



వేతనాలు ఇవ్వాలని జిల్లా కేంద్రంలో షెడ్యూల్డ్ క్యాస్ట్ అభివృద్ధి అధికారి పీవీ శ్రావణ్ కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది

వేతన జీవుల వెతలు

- ఎస్సీ వసతి గృహాల అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి అందని జీతాలు
- 8 నెలలుగా ఎదురుచూపు

కల్వకుర్తి, సెప్టెంబరు 18: నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఎస్సీ వసతి గృహాల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. వంట చేయడం, కామాటి, వాచ్‌మెన్లుగా పని చేయడం, విద్యార్థులకు భోజనాలు వడ్డించడం, పారిశుధ్య పనులు చేస్తున్న వారికి ఎనిమిది నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అంటున్నారు. చాలీ చాలని వేతనాలు వస్తేనే కుటుంబ పోషణ భారంగా ఉంటుందని, నెలల తరబడి ఇవ్వకపోవడంతో కుటుంబాలు గడవడం లేదని అంటున్నారు. పిల్లల చదువు భారంగా మారిందని, అప్పులు చేసి పూట గడుపుకుంటున్నామని చెబుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 35 సాంఘిక సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. అందులో 30 మంది రెగ్యులర్ సిబ్బంది ఉండగా, ఏజెన్సీల కింద 55 మంది పని చేస్తున్నారు. రిత్విక్ మ్యాన్ పవర్ ఏజెన్సీలో 49 మంది, పీవీఆర్ ఏజెన్సీలో ఆరుగురు ఉన్నారు. వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ వర్తింప జేయాలని జిల్లా కేంద్రంలోని షెడ్యూల్ క్యాస్ట్ అభివృద్ధి అధికారి పీవీ శ్రవణ్ కుమార్‌కు ఔట్ సోర్సింగ్ సిబ్బంది బుధవారం వినతి ప్రతం అందజేశారు.

అప్పులు చేసి పూట గడుపుకుంటున్నాం

ప్రభుత్వం వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ కోసం వడ్డీకి అప్పులు చేస్తున్నాం. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలి. అవుట్ సోర్సింగ్ సిబ్బందిని కార్పొరేషన్ కిందికి మార్చాలి.

- భగత్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, కల్వకుర్తి

బడ్జెట్ విడుదల కాగానే చెల్లిస్తాం

వసతి గృహాల్లో అవుట్ సోర్సింగ్ పద్దతిన పని చేస్తున్న సిబ్బందికి ప్రభుత్వం నుంచి బడ్జెట్ విడుదల కాగానే జీతాలు చెల్లిస్తాం. ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన వేతనాలను ప్రభుత్వం విడుదల చేసింది.

- పీవీ శ్రావణ్‌కుమార్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి

చికిత్స కోసం వెళితే..
లైంగిక వేధింపులు

- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఓ ఆర్‌ఎంపీ వికృత చేష్టలు
- సఖ్యతగా ఉండాలని వివాహితతో దురుసు ప్రవర్తన
- తల్లీ కూతుళ్లు గట్టిగా నిలదీయడంతో ఆస్పత్రి నుంచి పరార్

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 18: వైద్యం కోసం తల్లితోపాటు వెళ్లిన ఓ వివాహితను ఆర్‌ఎంపీ లైంగిక వేధింపులకు గురి చేశాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. తాడూరు మండలంలోని ఒక గ్రామానికి చెందిన వివాహితకు జ్వరం వచ్చింది. దాంతో చికిత్స కోసం తల్లితో పాటు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చింది. ఆర్‌ఎంపీ వైద్యుడు రోగికి వైద్యం చేయకుండా ఎంత మంది పిల్లలు, వివాహమై ఎన్ని రోజులు అయ్యింది అని అడిగాడు. తమ ఆస్పత్రిలో మూడు నెలల పాటు ఉంటే తమ దగ్గరికి స్నేహితులు వస్తుంటారని, వారితో సఖ్యతగా ఉంటే పిల్లలు పుడతారని లైంగికంగా వేధించాడు. దాంతో తల్లీ కూతుళ్లు అతన్ని గట్టిగా నిలదీయడంతో ఆస్పత్రిలోని మెడికల్ షాపులోంచి బయటకు వెళ్లిపోయాడు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జిల్లా కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. విషయాన్ని బాధితులు తమ బంధువులకు చెప్పడంతో వారితో తాడూరు మండలంలోని ఇద్దరు మాజీ ప్రజాప్రతినిధుల ద్వారా ఆర్‌ఎంపీ ఓ ఫామ్‌హౌస్‌లో బేరసారాలు జరుపుతున్నట్లు తెలిసింది. బాధితులు మాత్రం తమలా మరొకరికి జరుగొద్దని, అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఆ ఆర్‌ఎంపీపై గతంలో కూడా పలు ఆరోపణలు ఉన్నాయి. అతని ఆస్పత్రిని ఇటీవల రెండు సార్లు సీజ్ చేయడంతో పైరవీలు చేసి తెరిపించుకున్నాడు. ఈ ఘటనపై స్థానిక ఎస్ఐని వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ప్రజారోగ్యం పట్ల
నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసిన మంత్రి జూపల్లి
- విధులకు రాని వైద్యులపై ఆగ్రహం



వైద్య సిబ్బంది హాజరు పట్టికను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి

కొల్లాపూర్, సెప్టెంబరు 18 : కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే ప్రజల ఆరోగ్యం పట్ల వైద్యులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం ఆయన ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులు మంత్రి దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. దాంతో మంత్రి అసహనం వ్యక్తం చేశారు. 30 పడకలు ఉండాల్సి ఉండగా, కేవలం ఐదారు మాత్రమే ఉండటం ఏంటని డీఎంహెచ్‌వో డాక్టర్ స్వరాజ్యలక్ష్మిని ఆరా తీశారు. తొమ్మిది మంది డ్యూటీ డాక్టర్లకు కేవలం ఇద్దరు మాత్రమే ఉండటమేంటని అడిగారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ వారానికి ఒకసారి ఆస్పత్రికి వస్తున్నారని తెలుసుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు గైర్హాజరైన అందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేసి, వివరణ తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ స్వరాజ్యలక్ష్మిని మంత్రి ఆదేశించారు. నర్సులు తమ పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని కొందరు రోగులు మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ఇకపై ఇలాంటి చర్యలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆస్పత్రిలోని పలు విభాగాలను మంత్రి పరిశీలించారు. వైద్య సిబ్బంది హాజరు పట్టికను చూశారు. రోగులు విభాగాలను తేలికగా గుర్తించేలా సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. త్వరలోనే ఆస్పత్రి అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేస్తానని, రోగులకు మౌలిక వసతులు కల్పించేందుకు రూ.25 లక్షలు కేటాయిస్తున్నట్లు చెప్పారు. రోగులకు అన్ని రకాల వైద్య సేవలందేలు అందించాలని ఆదేశించారు. మంత్రి వెంట కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



సోమశిల-సిద్దేశ్వరం కొండల మధ్య కృష్ణానదిపై వంతెన నిర్మించనున్న ప్రదేశం ఇదే


తీగల వంతెనకు..
కేంద్రం గ్రీన్ సిగ్నల్

- సోమశిల-సిద్దేశ్వరం కొండల మధ్య నిర్మాణానికి 1082.56 కోట్లు మంజూరు
- టెండర్లకు నేడు చివరి తేదీ
- కృష్ణా పుష్కరాల వరకు పూర్తికి చర్యలు

కొల్లాపూర్, సెప్టెంబరు 18: కృష్ణా నదిపై సోమశిల-సిద్దేశ్వరం కొండల మధ్య వంతెన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.1,082.56 కోట్ల నిధులు మంజూరు చేసింది. టెండర్లు వేసేందుకు ఈనెల 19 చివరి తేదీగా నిర్ణయించారు. దీంతో వంతెన నిర్మాణంపై ఉన్న అనుమానాలకు చెక్ పెట్టినట్లైంది. ఆంధ్ర, రాయలసీమ ప్రాంతానికి చెందిన కొంతమంది ప్రజాప్రతినిధులు కృష్ణానదిపై తీగల వంతెన స్థానంలో బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మించాలని, మరికొందరు ఇరు రాష్ట్రాలకు అనుసంధానంగా అలుగు నిర్మించాలని నిరసనలు, ఆందోళనలు చేసినా వాటన్నింటికీ స్వస్తి పలికింది. దాంతో కొల్లాపూర్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజల చిరకాల కోరికగా ఉన్న సోమశిల-సిద్దేశ్వరం వంతెన నిర్మాణానికి అడుగు ముందుకు పడింది.

2007లోనే పునాది

సోమశిల- సిద్దేశ్వరం వంతెన నిర్మాణానికి 2007లోనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పునాది పడింది. రాజకీయ కారణాలు, టెండర్లలో నెలకొన్న సాంకేతిక సమస్యలతో పనులు ప్రారంభం కాలేదు. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వం ఎట్టకేలకు 17 సంవత్సరాల తర్వాత నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే 167కె జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు హైవే పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. 80 శాతం పూర్తయ్యాయి. కొల్లాపూర్‌లో సెయింట్ మేరీస్ చౌరస్తాలో ఫ్లైఓవర్ పనులకు కాంట్రాక్టర్లు చర్యలు చేపడుతున్నారు. సోమశిల- సిద్దేశ్వరం వంతెన నిర్మాణానికి కేంద్రం అంగీకారం తెలుపడంతో సంగమేశ్వరం నుంచి ఆత్మకూరు, నంద్యాల వరకు 167కె జాతీయ రహదారి పనుల ప్రారంభానికి డిజైన్లు కూడా రూపొందించారు.



తీగల వంతెన నమూనా

దేశంలోనే మొదటిసారిగా

తెలుగు రాష్ట్రాలను అనుసంధానం చేస్తు కృష్ణానదిపై కేంద్రం నిర్మించతలపెట్టిన తీగల వంతెన దేశంలోనే మొట్టమొదటిది కాబోతుంది. లండన్ సస్పెన్స్ బ్రిడ్జి తరహాలో ఈ వంతెన నిర్మించనున్నారు. కొండల మధ్య పిల్లర్లు కాకుండా లండన్ వంతెన మాదిరిగా అటు ఇటు రెండు పెద్ద టవర్లు నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ రెండు టవర్లకు కేబుల్స్ నుంచి వంతెన సబ్‌సెంట్ అవుతుంది. ఈ వంతెన ఏర్పాటు చేయడానికి ఇప్పటికే జాతీయ రహదారుల సంస్థ కూడా నిర్ణయం తీసుకుంది.

వంతెన నిర్మాణంతో తగ్గనున్న దూరాభారం

తీగల వంతెనతో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రాకపోకలకు సులువైన మార్గం ఏర్పడనుంది. తెలంగాణ నుంచి తిరుపతికి వెళ్లే ప్రయాణికులకు కనీసం 80 కిలో మీటర్ల మేర దూరం తగ్గే అవకాశం ఉంది. నది పరిసర ప్రాంతాల ప్రజలు నదిపై పడవ ప్రయాణం చేయకుండా వంతెన మీదుగా వెళ్లడంతో ప్రమాదాల బారిన పడకుండా ఉంటారు. ఈనెల 24వ తేదీన కేంద్ర రోడ్డు రవాణా, జల వనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలువనున్నారు.

కృష్ణా పుష్కరాల వరకు పనులు పూర్తి

వచ్చే కృష్ణా పుష్కరాల వరకు తీగల వంతెన పూర్తికి కేంద్రం చర్యలు చేపట్టనుంది. 2016లో వచ్చిన కృష్ణా పుష్కరాలు తిరిగి 2028 సెప్టెంబరులో రాబోతున్నాయి. అప్పటి వరకు తీగల వంతెనను అందుబాటులోకి తెచ్చేలా కాంట్రాక్టర్లకు టార్గెట్ విధించనున్నట్లు తెలుస్తోంది.

గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి

- నదిలో పడి యువకుడి మృతి

కృష్ణ, సెప్టెంబరు 18 : గణేశ్ నిమజ్జన వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకున్నది. నిమజ్జనం చేస్తున్న సమయంలో నదిలో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలో జరిగింది. మాగనూరు మండలం కొల్లూరు గ్రామ యువకులు బుధవారం కృష్ణ మండలం ముడుమాల్ గ్రామ సమీపంలోని కృష్ణానదిలో గణనాథుడి విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు వెళ్లారు. పూజలు చేసిన అనంతరం విగ్రహాన్ని నదిలో జార విడుస్తుండగా ప్రమాద వశాత్తు కొల్పూర్ గ్రామానికి చెందిన తాయప్ప (30) నదిలో పడి మునిగిపోయాడు. నది లోతుగా ఉండటంతోనే ఈ సంఘటన జరిగింది. మృతుడికి భార్యతో పాటు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కూతురు కనిపించడం లేదని
తల్లి ఆత్మహత్య

హన్వాడ, సెప్టెంబరు 18: తల్లిదండ్రులకు ఇష్టం లేని పెళ్లి చేసుకున్న కూతురు కనిపించకుండా పోవడంతో మనస్తాపానికి గురై తల్లి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం షేక్‌పల్లిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్‌పల్లికి చెందిన ద్యావరి నర్సమ్మ(45) కూతురు అంజలి నాలుగు నెలల క్రితం ప్రేమ పెళ్లి చేసుకుంది. మూడు రోజుల నుంచి కూతురు కనిపించకుండా పోయిందని తెలియడంతో నర్సమ్మ మంగళవారం రాత్రి పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. నర్సమ్మ భర్త మొగులయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

వివాహిత అదృశ్యం


మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన నరమోని అంజలి కనిపించడం లేదని భర్త కృష్ణ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. అంజలి ఈ నెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఎవరికైనా కనిపిస్తే హన్వాడ పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.


భార్యపై భర్త దాడి

- పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి
- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఘటన
- కొడుకు ఫిర్యాదుతో కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 18: భార్యపై భర్త అకారణంగా దాడి చేయడంతో పరిస్థితి విషమించి ఆమె మృతి చెందింది. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ ఈదమ్మగుడి కాలనీకి చెందిన అబ్దుల్ రజాక్ ఈ నెల 16న భార్య మహమ్మద్‌బేగం(51)పై అకారణంగా కర్రతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందింది. మహమ్మద్ బేగం కుమారుడు అబ్దుల్‌హమీద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.









ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

జడ్చర్ల, సెప్టెంబరు 18 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గంగాపురంలో సునీత(51) ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళ వారం రాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గంగాపురంలో ఉంటూ ప్రైవేట్‌గా ఆయా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న సునీతకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా ఆమె మద్యానికి అలవాటు పడి, మానసికంగా, శారీరకంగా జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడిందని కుమార్తె కవిత ఫిర్యాదు చేసిందని సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

వాహనం ఢీకొని మహిళ మృతి

జడ్చర్ల, సెప్టెంబరు 18 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసి పాలిటీలోని బూరెడ్డిపల్లి స్టేజీ సమీపంలో రోడ్డు దాటుతున్న మహిళను మంగళవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీ వ్రంగా గాయపడిన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలకు చెందిన పెబ్బేటి జ్యోత మ్మ (47) అక్కడికక్కడే మృతి చెందిందని సీఐ ఆదిరెడ్డి బుధవారం తెలి పారు. హోటల్‌లో కూలీ పనులు చేసుకుంటూ ఆమె జీవనం సాగిస్తున్న ట్లు తెలిపారు. అల్లుడు పరమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.



రోడ్డు సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న నెమలిగుట్టతండా గ్రామస్థులు

చారకొండ, సెప్టెంబరు 18: మండలంలోని జేపల్లి పంచాయతీలోని నెమలిగుట్ట తండాకు సరైన రోడ్డు మార్గం లేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నామని బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి గ్రామస్థులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తండావాసులు మాట్లాడుతూ నెమలిగుట్టతండా నుంచి దొంగలగుట్టతండా వరకు మట్టి రోడ్డు అస్తవ్యస్తంగా మారి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతుందన్నారు. నెమలిగుట తండా నుంచి జూపల్లి వరకు కాంట్రాక్టర్లు కంకర పరిచి బీటీ వేయకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు కలిగి ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయన్నారు. అదేవిధంగా కేఎల్‌ఐ కాలువ నిర్మాణం పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యేకు వివరించినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు పవన్‌నాయక్, కిషన్, రాజు, గోపాల్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జడ్చర్ల, సెప్టెంబరు 18: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మున్సిపాలిటీలోని క్లబ్‌రోడ్డులో ఉన్న లక్ష్మీవేంకటేశ్వర ఎంప్లాయిస్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిందని సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సుంకసారి శ్రీహరి మంగళవారం రాత్రి 11గంటల ప్రాంతంలో ఇంటికి తాళం వేసి వెళ్లాడు. తిరిగి బుధవారం ఉదయం 6గంటలకు వెళ్లి చూడగా తాళం విరగ్గొట్టి ఉండడంతో, ఇంట్లో ఉన్న వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో చోరీ జరిగినట్లుగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఇంట్లో దాచి ఉంచిన సుమారు రూ.2.20లక్షల విలువగల 11తులాల బంగారు వస్తువులు చోరీ అయ్యాయని శ్రీహరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ వివరించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కొల్లాపూర్, సెప్టెంబరు 18 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని అంకిరావుపల్లి శివారులో ఎంజీకేఎల్‌ఐ ప్రధాన కాలువ పక్కన ఓ కంటైనర్ బాక్సులో పేకాట స్థావరంపై బుధవారం రాత్రి పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. ఏడుగురు పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు ద్విచక్ర వాహనాలతో పాటు రూ.11,180 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ హృషికేష్ పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని, ఎవరినీ ఉపేక్షించేది లేదని ఎస్‌ఐ హెచ్చరించారు.













జ్యువెలరీ దుకాణంలో చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ వెంకటేష్

హన్వాడ, సెప్టెంబరు 18: మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రంలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు జ్యువెలరీ దుకాణంలో చోరీ చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. టంకరకు చెందిన ఆసుల కృష్ణయ్య హన్వాడలో రెండేళ్ల నుంచి దుకాణం నడిపిస్తున్నాడు. మంగళవారం రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లాడు. బుధవారం వచ్చే సరికి తలుపుతీసి ఉండడం చూశాడు. దుకాణంలో మూడు తులాల బంగారం, 30 తులాల వెండి వస్తువులను ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. బుధవారం కృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సూపర్ మార్కెట్‌లో నగదు అపహరణ

నారాయణపేట, సెప్టెంబరు 18: నారాయణపేట జిల్లా కేంద్రం లోని పాతగంజ్‌లో గల అంబికా సూపర్ మార్కె ట్‌లో మంగళవా రం రాత్రి గుర్తుతెలి యని వ్యక్తులు చోరీకి పాల్పడగా బుధ వారం ఉదయం వెలుగు చూసింది. ఉదయం దుకా ణం తెరవగా చోరీ విష యాన్ని పోలీసులకు సమా చారం అందించారు. గేటు తాళం విరగొట్టి గల్లీలో నుంచి వచ్చి దుకాణంపై ఉన్న రేకును తొలగించి లోపలికి ప్రవేశించారు. క్యాష్ కౌంటర్‌లో ఉంచిన రూ.1.50లక్షల నగదు అపరించారు. అలాగే జాగ్రత్త పడి సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి ఫుటేజీ రికార్డు అయ్యే డీవీఎస్ బాక్స్‌ను సైతం ఎత్తుకెళ్లారు. మరో లాకర్‌లో ఉంచిన రూ.ఐదు లక్షల నగదును ముట్టుకోలేదు. చోరీ జరిగిన తీరును పోలీసులు పరిశీలించారు. దుకాణ యజమానితో పాటు పని చేసేవారితో అన్ని విషయాలు పోలీసులు విచారించారు. వరుసగ సెలవులు ఉండడంతో బ్యాంకులో డబ్బు జమ చేయలేదని, హోల్‌సేల్ వ్యాపారికి చెల్లించాల్సిన నగదు లాకర్‌లో ఉంచగా అది తెరుచుకోలేదని సూపర్‌మార్కెట్ యజమానులు చెప్పుకొచ్చారు. ఆధారాలు లభించకుండా పక్కా ప్రణాళికతో చోరీ చేశారు.

చోరీకి పాల్పడిన నిందితుల అరెస్ట్

- 12.3 తులాల బంగారు నగలు రికవరీ

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 18: పాత ఇనుప సామానులు అమ్ముకునే ఇద్దరు తాళం పగలకొట్టి ఇంట్లో నగలు అపహరించిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ సీఐ ఎజాజుద్దీన్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బోయపల్లికి చెందిన మండల్ల మాసయ్య, అదే గ్రామానికి చెందిన మండ్ల లక్ష్మీ పాత ఇనుప సామాన్లు సేకరించి అమ్ముకుంటారు. ఈ క్రమంలో ఈనెల 15న రాత్రి పాత ఇనుపసామాన్ల కోసం న్యూమోతీనగర్‌కు వెళ్లారు. అక్కడ ఓ ఇంటికి తాళం వేసి ఉండటంతో తాళం పగలకొట్టి ఇంట్లో ఉన్న బంగారు నగలు అపహరించారు. దీనిపై బాధితులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నిందితులు బుధవారం నగలను అమ్ముకునేందుకు న్యూటౌన్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా విషయం బయటపడింది. వారి వద్ద 12.3 తులాల బంగారు నగలను రికవరీ చేసి నిందితులిద్దరిని రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన టూటౌన్ ఎస్‌ఐ విజయభాస్కర్, ఎస్‌కె ఓబుల్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ శేఖర్, రఘునాథ్‌రెడ్డి పలువురిని సీఐ అభినందించారు.

కల్లు దొరకక
ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

గద్వాల క్రైం, సెప్టెంబరు 18: కల్లు తాగే అలవాటు ఉన్న మహిళకు సమయానికి దొరకకపోవడంతో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ధరూర్ మెట్టు కాలనీలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాల పట్టణంలో ధరూర్ మెట్టు కాలనీకి చెందిన చాకలి సుజాత(35) కల్లుకు బానిసైంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కల్లు సమయానికి దొరకకపోవడంతో మనస్తాపంతో ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది. విషయాన్ని గమనించిన కుమారుడు గట్టిగా కేకలు వేయడంతో ఇంటిపైన ఉన్న సుజాత భర్త ఆంజనేయులు తలుపును తోసి ఫ్యానుకు వేలాడుతున్న ఆమెను దించి చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందింది. సుజాత తల్లి గోకారమ్మ ఫిర్యాదు మేరకు బుధవారం కేసును నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కల్వకుర్తిలో ఫొటోగ్రాఫర్ బలవన్మరణం



జలాల్ (ఫైల్)

కల్వకుర్తి, సెప్టెంబరు 18 : ఇంట్లో ఉరేసుకుని ఫొటోగ్రాఫర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కరీం కుమారుడు జలాల్(45) సిర్సవాడలో ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. కల్వకుర్తిలోని తన నివాసంలో బుధవారం ఉదయం ఎవరూ లేని సమయంలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారమందించారు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కానిస్టేబుల్ మృతికి ఎస్పీ సంతాపం

గద్వాల క్రైం, సెప్టెంబరు 18 : రోడ్డు ప్రమాదంలో మహిళా కానిస్టేబుల్ శ్రావణి మృతిపై జోగుళాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు బుధవారం సంతాపం వ్యక్తం చేశారు. జిల్లా పరిధిలోని కేటీదొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఈమె విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం నాగార్జునసాగర్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడం బాధాకరమన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఎంతో బాధ్యతతో రిసెప్షన్ విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందించినట్లు తెలిపారు. జిల్లా పోలీస్ వ్యవస్థకు కానిస్టేబుల్ లేనిలోటు తీరనిదని, బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పోలీసుల విధులకు ఆటంకం: కేసు నమోదు

- ఉప్పలలో వినాయక ఊరేగింపులో వివాదం

అయిజ, సెప్టెంబరు 18 : శాంతియుత వాతావరణంలో సాగాల్సిన గణేష్ నిమజ్జనం కాస్త పోలీసులకు, వినాయక భక్తుల మధ్యన గొడవకు దారి తీసింది. ఇటీవల జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఉప్పల గ్రామంలో వినాయక నిమజ్జన కార్యక్రమం కొనసాగుతోంది. అందులో భాగంగా డీజే సౌండ్ ఏర్పాటు చేయగా, ఇది ఇబ్బందికరంగా మారిందని కొంతమంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసు సిబ్బంది వచ్చి అడ్డుకున్నారు. ఎవరో ఫిర్యాదు చేస్తే మా ఊరేగింపుకు ఇబ్బంది కలిగిస్తారా? అని పోలీసులతో ఘర్షణకు దిగారని తెలిసింది. కాగా పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు 8 మందితో పాటు మరి కొంతమందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ బుధవారం తెలిపారు.

పలువురిపై కేసు నమోదు

అయిజ మండలంలోని ఉప్పలలో 9వ రోజు వినాయక నిమజ్జన 16వ తేదీ చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా అనుమతి లేకుండా డీజే బాక్స్‌లు పెట్టి పెద్ద పెద్ద శబ్దాలతో ప్రజలకు ఇబ్బందులు కలుగచేస్తున్నారన్న సమాచారం మేరకు వారికి సర్ధిచెప్పేందుకు సిబ్బంది వెళ్లినట్లు తెలిపారు. వినకపోగా పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని తెలిపారు. ఈమేరకు నర్సింహులు, రాజు, నాయికి ఉపేంద్ర, లింగం వీరేష్, కుర్వ రాంబాబ, జమ్మన్న, రవిగౌడు, మరొక మహిళతో పాటు మరి కొంతమందిపై సుమోటోగా స్వీకరించి మంగళవారం సాయంత్రం కేసు నమోదు చేసి విచారిస్తున్నామని తెలిపారు.

కృష్ణానదిలో పూర్తిగా నిలిచిపోయిన వరద

గద్వాల, సెప్టెంబరు 18: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో కృష్ణానదికి ఆల్మట్టి నుంచి జూరాల వరకు వరద పూర్తిగా నిలిచిపోయింది. మంగళవారం వరకు విద్యుదుత్పత్తి ద్వారా ఆల్మట్టి, నారాయణపూర్‌లో నీటి విడుదల కొనసాగింది. బుధవారం జూరాలకు ప్రాజెక్టుల నుంచి వచ్చే సీఫేజ్ వాటర్ 16,500 క్యూసెక్కులు రాగా విద్యుదుత్పత్తి ద్వారా 15,120 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. నెట్టంపాడు, భీమా ఎత్తిపోతల పథకాలతో పాటు ఎడమ, కుడి కాలువలకు 3,100క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు కూడా పూర్తిగా వరద నిలిచిపోవడంతో గేట్లను మూసివేసి జల విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. సుంకేసులకు 9,200 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా 6,759 క్యూసెక్కులు శ్రీశైలంకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలంకు 27వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో పడిపోవడంతో గేట్లను మూసివేసి కేవలం విద్యుత్ ఉత్పత్తి ద్వారా 67వేల క్యూసెక్కులు నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 215.80టీఎంసీలు కాగా ప్రస్తుతం 191.21టీఎంసీల నిల్వ ఉంది.

పాఠశాలల క్రీడా పండుగ

- ఎస్‌జీఎఫ్ పోటీలకు తేదీల ఖరారు
-ప్రారంభమైన మండల, జిల్లా స్థాయి జట్ల ఎంపికలు



మిడ్జిల్‌లో మండల స్థాయి ఖోఖో జట్ల ఎంపికలు (ఫైల్)

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 18: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీల నిర్వహణకు ముందడుగు పడింది. 2024-25 సంవత్సరానికి సంబంధించి పోటీలను నిర్వహించే తేదీలను ఇటీవలే రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నుంచి జిల్లాలకు ఆదేశాలు జారీ అయ్యాయి. డీఈవోల ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి పోటీల తేదీలు ఖరారు చేశారు. ఈ ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల నిర్వహణకు సమాయత్తమయ్యారు. మండల స్థాయి పోటీలు, ఎంపికలు ప్రారంభమయ్యాయి. పాఠశాల, కళాశాల స్థాయిలో అండర్-14, 17, 19 విభాగాల్లో బాల, బాలికలకు వేర్వేరుగా మండల, జిల్లా స్థాయి అనంతరం ఉమ్మడి జిల్లా జట్లను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపిస్తారు. మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల తేదీలు ఖరారు కావడంతో క్రీడాకారుల్లో ఉత్సాహం నెలకొంది.



నంచర్ల హైస్కూల్‌లో మండల స్థాయి కబడ్డీ జట్ల ఎంపికలు (ఫైల్)

20 అంశాల్లో క్రీడా పోటీలు

మొదటగా మండల స్థాయిలో ఈ నెల 20వ తేదీ వరకు ఖోఖో, కబడ్డీ, ఖోఖో క్రీడా అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 25 నుంచి బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, క్రికెట్, సాఫ్ట్‌బాల్, యోగా, ఆర్చరి, బాక్సింగ్, నెట్‌బాల్, రగ్బీ, చెస్, తైక్వాండో, కరాటే, జూడో క్రీడా అంశాల్లో జిల్లా, ఉమ్మడి స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఆయా పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. కళాశాల స్థాయిలో ఎస్‌జీఎఫ్ అండర్-19 ఉమ్మడి జిల్లా క్రీడ ఎంపికలు ఈ నెల చివరి వారం నుంచి ప్రారంభం కానున్నాయి.

గతేడాది జాతీయ స్థాయికి 90 మంది క్రీడాకారులు

2023-24 విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో 11 రాష్ట్ర స్థాయి టోర్నీలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 4 టోర్నీలు, వనపర్తిలో 3, జోగుళాంబ గద్వాల 2, నాగర్‌కర్నూల్ 1, నారాయణపేట జిల్లాలో ఒక టోర్నీ నిర్వహించగా, 90 మంది బాల, బాలికలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. వారికి భవిష్యత్‌లో ఉన్నత విద్య, ఉద్యోగాల్లో క్రీడాకోటా దక్కనుంది.

పకడ్బందీగా నిర్వహిస్తాం..



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలను పారదర్శకంగా నిర్వహిస్తాం. మండల స్థాయిలో ఖోఖో, కబడ్డీ, మిగితా క్రీడా అంశాల్లో నేరుగా జిల్లా స్థాయి, ఉమ్మడి జిల్లా స్థాయిలో ఎంపికలు ఉంటాయి. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులనే రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తాం.

- శారదాబాయి, అండర్-17 ఎస్‌జీఎఫ్ సెక్రటరీ, మహబూబ్‌నగర్

వేతనాల కోసం ఆసుపత్రి కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

జడ్చర్ల, సెప్టెంబరు 18 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించలేదని, దీంతో పరిసరాలతో ఆసుపత్రి ఎదుట బుధవారం నిరసన తెలిపారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చీపురు కట్టలు, వైపర్స్, స్ట్రక్చర్, వీల్‌చైర్, చెత్తకుండీలతో నిరసన వ్యక్తం చేశారు. ఐదు నెలల పెండింగ్ వేతనాల చెల్లింపులలో, ఏడు నెలల వేతన బడ్జెట్ విడుదలలో ప్రభుత్వ అలసత్వానికి నిరసనగా ఈ నెల 19న రాష్ట్ర వ్యాప్తంగా ఆసుపత్రి కార్మికులు పని బంద్ సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని నాయకుడు సురేష్ వెల్లడించారు. కార్మికులు నర్సింహులు, నాగరాజు, నవీన్, విజయలక్ష్మి, మన్నెమ్మ, అలివేలు, పద్మ, సుక్కమ్మ, లక్ష్మీనరసమ్మ, సత్యమ్మ, నీరజ, స్వాతి, యాదమ్మ పాల్గొన్నారు.

బీమా కాలువల మరమ్మతుకు ప్రతిపాదనలు



గండిపడ్డ భీమా కాలువను పరిశీలిస్తున్న ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు

వీపనగండ్ల, సెప్టెంబరు 18 : భీమా కాలువ గండ్ల మరమ్మతు చేపట్టేందుకు రూ.1.28 కోట్ల ప్రతిపాదనలు పంపించినట్లు ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలంలోని కల్వరాల, వీపనగండ్ల మధ్య గండిపడ్డ 16వ ప్యాకేజీ భీమా కాలువలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల జిల్లాలో పలు చోట్ల కాలువలకు గండ్లు పడ్డాయని తెలిపారు. 16 ప్యాకేజీ కాలువకు పుల్గర్‌చర్ల, కల్వరాల సమీపంలో రెండు గండ్లు, 19వ ప్యాకేజీలో ఒకటి, 27వ ప్యాకేజీ కాలువకు తొమ్మిది గండ్లు పడ్డాయి. సుగూరు, పెబ్బేరు, జనుంపల్లి చెరువులకు గండ్లు పడినట్లు తెలిపారు. వీటి మరమ్మతు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. అనుమతులు వచ్చిన వెంటనే టెండర్లు పిలిచి పనులు చేపడుతామన్నారు. త్వరగా పనులు పూర్తి చేసి సాగునీరు విడుదల చేయాలని రైతులు కోరారు. ఈఈ కేశవరావు, ఏఈ కిశోర్ ఉన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

- ఉమ్మడి జిల్లా డీజీఎం కృష్ణప్రసాద్



సహకార పెట్రోల్ బంకును పరిశీలిస్తున్న డీజీఎం, అధికారులు

ధరూరు, సెప్టెంబరు 18 : సహకార బ్యాంకు ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకుని వ్యాపారులు ఆర్థికంగా ఎదగాలని సహకార బ్యాంకు ఉమ్మడి జిల్లా డీజీఎం కృష్ణప్రసాద్ అన్నారు. సహకార బ్యాంకు ఆధ్వర్యంలో జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇండియన్ పెట్రోల్ బంకుతో పాటు సహకార బ్యాంకును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ జిల్లాలో మొట్టమొదటి సారిగా మండల కేంద్రంలో సహకార బ్యాంకు ఆధ్వర్యంలో ఇండియన్ పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేసుకున్నారన్నారు. బ్యాంకు ద్వారా అందే రుణాలతో రైతులతో పాటు వివిధ వ్యాపారస్తులు, గ్రామస్తులు సద్వినియోగం చేసుకుని ఆర్థికస్వావలంబనను సాధించాలన్నారు. అదేవిధంగా ఇటీవల కొత్తగా ధరూరులో సహకార బ్యాంకు ప్రారంభించామని డీజీఎం గుర్తుకుచేశారు. మండల కేంద్రంతో పాటు గ్రామాలకు చెందిన రైతులు పంట రుణాలను తీసుకోవాలని సూచించారు. బ్యాంకు వచ్చే రైతులకు సకాలంలో రుణాలు అందజేయాలని సహకార బ్యాంకు సీఈఓ రాజును ఆదేశించారు. అలాగే సహకార బ్యాంకు ఆధ్వర్యంలో గోల్డ్ లోన్లను ప్రజలకు ఇచ్చే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో గద్వాల బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు, సూపర్‌వైజర్ రామాంజనేయులు, చాకలి వెంకటేష్, శాంతన్న, పరశ ఉన్నారు.

సీసీ వేసి.. లీకేజీలు నివారించండి

- తరచూ తెగుతున్న కేఎల్‌ఐ సబ్ బ్రాంచ్ కాలువ
- కాలువలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు



కోడేరులో కేఎల్ఐ సబ్‌బ్రాంచ్ కింద ఏపుగా పెరిగిన జమ్ము

కోడేరు, సెప్టెంబరు 18 : కేఎల్ఐ సబ్ బ్రాంచ్ కాల్వలకు సీసీ వేసి కాల్వలు లీకేజీ కాకుండా, తరచుగా తెగిపోకుండా చేసి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని పస్పుల, కోడేరుతో పాటు జనుంపల్లి, ముత్తిరెడ్డిపల్లి, నాగులపల్లి, ఎత్తం, మైలారం గ్రామాల్లో కేఎల్ఐ సబ్ బ్రాంచ్ కాలువలో జమ్ము, గడ్డి, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి సాగునీరు చివరి ఆయకట్టుకు వెళ్లక కాల్వలు ఎక్కి పారుతూ తరచుగా తెగి పంటలు కొట్టుకుపోతున్నాయి. పంటలు కొట్టుకుపోవడంతోపాటు భూములు కూడా కోతకు గురై వ్యవసాయానికి పనికి రాకుండాపోతున్నాయి.

సీసీ వేస్తే కొంత వరకు మేలు

కాల్వలకు కింద, రెండు సైడ్లకు సీసీ వేస్తే జమ్ము, గడ్డి సమస్యలు ఉండవు. సాగునీరు చివరి ఆయకట్టుకు కూడా సులభంగా చేరుతుంది. కాలువలు తెగిపోవడం కూడా తగ్గుతుంది. ఇరు వైపులా ఉన్న పొలాలకు కాలువల్లోని సాగునీరు లీకేజీ అయి జమ్ము, గడ్డి, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి వ్యవసాయానికి భూములు పనికిరాకుండా పోతున్నాయి. ప్రజాప్రతినిధులకు, అధికారులకు కాల్వలకు సీసీ వేయాలని ఎన్నోసార్లు వినతిపత్రాలు ఇచ్చిన ఫలితం లేదని చుట్టు పక్క రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి సీసీ వేయించి రైతుల పంటలను కాపాడడంతోపాటు చివరి ఆయకట్టుకు సాగు నీరందించాలని కోరుతున్నారు.

లీకేజీని అరికట్టాలి



కేఎల్ఐ కాలువలకు కింద రెండు వైపులా సీసీ వేసి కాలువల్లో సాగునీరు లీకేజీని నివారించాలి. సీసీ వేయడం వల్ల జమ్ము, గడ్డి పెరిగే అవకాశం ఉండదు. కాల్వలు తెగి పోవడం కూడా నివారించవచ్చు. మండల కేంద్రంతో పాటు కేఎల్ఐ సబ్ బ్రాంచ్ కాల్వల ద్వారా నీరు వ్యవసా య పంటలకు పుష్కలంగా ఇవ్వవచ్చు. కొన్ని పొలాలకు సాగునీరు చేరడం లేదు. అధికారులు స్పందించి పిల్ల కాల్వలు కూడా పూర్తి చేయాలి.

- పి.రవి, రైతు, కోడేరు

సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



హరి నిరంజన్



బి.భారతి

పెద్దమందడి, సెప్టెంబరు 18 : వనపర్తి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన జిల్లా కేంద్రంలో బాలకృష్ణయ్య క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన అథ్లెటిక్స్ ఎంపికల్లో మోజర్ల ఉద్యానవన కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. అండర్-20 బాలికల విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో బి. భారతి ప్రథమ స్థానం, అండర్-18 బాలుర విభాగంలో 600 మీటర్లలో హరి నిరంజన్ ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరిద్దరు 19, 20 తేదీలలో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరగబోయే సౌత్‌జోన్ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని, అలాగే రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కళాశాల అసోసియేట్ డీన్ పిడిగం సైదయ్య సూచించారు. ఎంపికైన విద్యార్థులను ఓఎస్‌ఏ డాక్టర్ రాజశేఖర్, ఓఏఎం డాక్టర్ షహనాజ్, ప్రొఫెసర్స్, ఫిజికల్స్ డైరెక్టర్ మహేష్ అభినందించారు.

జాతీయ సైన్స్ ఫెయిర్‌కు తిప్పడంపల్లి విద్యార్థి



నిఖిల్ కుమార్

ఆత్మకూరు, సెప్టెంబరు 18 : జాతీయ సైన్స్ ఫెయిర్‌కు వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం తిప్పడంపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి నిఖిల్ కుమార్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. గత నెలలో ఆన్‌లైన్ ద్వారా జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. దీర్ఘకాలిక గాయాలకు సంబంధించి స్మార్ట్ బ్యాండేజ్ అంశంపై ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు తెలిపారు. 19, 20వ తేదీలలో నిర్వహించబోయే పోటీలలో గైడ్ అరవింద్ పర్యవేక్షణలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత : కేసు నమోదు

బిజినేపల్లి, సెప్టెంబరు 18 : అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం రాత్రి పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం మామిడమాడకు చెందిన గోపాల్ మామిడమాడ నుంచి బిజినేపల్లి మండలం మంగనూర్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. యజమాని, డ్రైవర్ గోపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 12మందికి జరిమానా, జైలుశిక్ష

అలంపూర్, సెప్టెంబరు 18: పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో ఎనిమిది4 మందికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధించినట్లు ఏఎస్‌ఐ ఎస్‌ఎం.బాషా బుధవారం తెలిపారు. గతంలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడగా వారిపై కేసు నమోదు చేసి 12మందిని బుధవారం అలంపూర్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి కమలాపురం కవిత వారిని విచారించి ఒక్కొక్కరికి రూ.2వేల జరిమానాతో పాటు జైలుశిక్ష విధించినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

గద్వాల క్రైం, సెప్టెంబరు 18: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో ఇద్దరుకి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధరూర్ మండలం పెద్దపాడు చెందిన ఇద్దరు యువకులు జమ్మిచేడు నుంచి వారి గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో వారిద్దరూ కింద పడటంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

పుస్తకాల వితరణ



పుస్తకాలను పరిశీలిస్తున్న పీయూ అధ్యాపకులు

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 18 : పాలమూరు యూనివర్సిటీ లైబ్రరీకి న్యూ పబ్లికేషన్స్ వారు అన్ని విభాగాలకు పుస్తకాలను వితరణ చేశారు. బుధవారం లైబ్రరీలో ఏర్పాటు చేసిన పుస్తకాల ఎగ్జిబిషన్ అధ్యాపకులు, అధికారులు తమకు కావాల్సిన పుస్తకాలను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన వాటిని లైబ్రరీకి అందజేశారు. ఎగ్జిబిషన్‌లో పీయూ పరీక్షల నిర్వహణ అధికారి రాజ్‌కుమార్, లైబ్రరీ కోఆర్డినేటర్ డాక్టర్ అనురాధరెడ్డి, అధ్యాపకులు రంగప్ప, వెంకటేష్, అర్జున్ కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సగరులకు సముచిత స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్

కల్వకుర్తి, సెప్టెంబరు 18 : స్థానిక సంస్థల్లో సగరులకు సముచిత స్థానం కల్పిం చాలని సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో సగర భగీరథ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సమావేశానికి ఆయనతో పాటు ప్రధాన కార్యదర్శి సత్యం, కార్యదర్శి వివేకానంద, రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు సురేష్ హాజరయ్యారు. అనంతరం శేఖర్ వి లేకర్లతో మాట్లాడుతూ గతంలో 1986లో ఎన్‌టీఆర్ ప్రభుత్వం జీవో నంబరు 166 ప్రకారం సగరులను బీసీ డీ నుంచి బీసీ-ఏలోకి మార్చారని పేర్కొన్నారు. అనంతరం కొన్నికారణాల వల్ల అడ్డంకులు ఎదురయ్యాయని, ముఖ్యమంత్రి స్పందించి సగరులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

బాలానగర్, సెప్టెంబరు 18 : ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ విజయేందిర బోయి వైద్యులను ఆదేశించారు. బుధవారం మండలంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జడ్పీహెచ్ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. పదో తరగతి తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియంలో ఫిజికల్ సైన్స్ సబ్జెక్టు బోధిస్తుండగా పాఠశాలకు ఎక్కడి నుంచి వస్తున్నారు, భోజనం ఎలా ఉందని? అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బందితో ధరణి, తదితర అంశాలపై సమీక్షించారు.

ఓపెన్ టెండర్ విధానాన్ని రద్దు చేయాలి

- ప్రగతిశీల భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు సి.వెంకటేష్

పాలమూరు, సెప్టెంబరు 18 : భవన నిర్మాణ కార్మికుల కోసం అమలవుతున్న స్కీంలపై ప్రవేశపెట్టదలిచిన ఓపెన్ టెండర్ విధానాన్ని రద్దు చేయాలని ప్రగతిశీల భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు సి.వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం మహబూబ్‌నగర్ రూరల్ మండలంలో సంఘం ఆధ్వర్యంలో కార్మికులకు అవగాహన కల్పించారు. 19వ తేదీన కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాకు కార్మికులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జి.రాజు, ఆఆంజనేయులు, వి.రాజు, ఎస్.ఆంజనేయులు, నిజాంపాషా, దాసు, ఖాదర్, కృష్ణయ్య, భీమయ్య పాల్గొన్నారు.

వెల్ఫేర్‌బోర్డును ప్రైవేట్‌కు అప్పగించటం సరికాదు

పాలమూరు : వెల్ఫేర్‌బోర్డును ప్రైవేట్ బీమా సంస్థలకు అప్పగించడం సరికాదని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోనెల రాములు, వరద గాలెన్నలు బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. గురువారం తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్లాస్టిక్ కవర్లు వాడొద్దు

- తిమ్మాయిపల్లితండాలో స్వచ్ఛతాహి సేవ ర్యాలీ

అడ్డాకుల సెప్టెంబరు 18 : ప్లాస్టిక్ సంచులు, ఇతర ప్లాస్టిక్ వస్తువులు వాడరాదని తిమ్మాయిపల్లితండాలోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలరాజు అన్నారు. మండల పరిధిలోని తిమ్మాయిపల్లితండాలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ప్లాస్టిక్ వాడితే కలిగే అనర్థాలు, ఇప్పటికే ఇబ్బడి ముబ్బడిగా వాడటం వల్ల పెరిగిన భూతాపం గురించి ప్రజలకు వివరించారు. ప్లాస్టిక్ వాడకూడదని, బుట్ట సంచులు వాడాలని, మొక్కలు నాటి భూ వేడిని తగ్గించాలని, పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మణ్‌గౌడ్, మలేకబేగం, లక్ష్మీదేవి, నర్మద పాల్గొన్నారు.

● రాజాపూర్ : ఈ నెల 17వ తేదీ నుంచి వచ్చే నెల రెండవ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అధికారులు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ నుంచి మండల కేంద్రంలోని వీధుల్లో పలు పార్టీల నాయకులు, అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంలో పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మచ్చేందర్, ఎంపీవో వెంకట్‌రాములు, నాయకులు నరహరి, గోవర్ధన్‌రెడ్డి, గోనెల రమేష్, రమణ, శ్రీధర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, ప్రశాంత్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

చిన్ననాటి మిత్రుడి కుటుంబానికి చేయూత

గండీడ్, సెప్టెంబరు 18 : మండల పరిధిలోని వెన్నాచేడ్ గ్రామంలో వడ్ల అర్జున్ (42) మంగళవారం రాత్రి మృతిచెందాడు. అర్జున్ మృతితో 1997-98 బ్యాచ్‌లో పదవ తరగతి పూర్తి చేసుకున్న మిత్రులంతా కలిసి రూ.23 వేలు జమ చేసి బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత అందించారు. మిత్రుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం ఇచ్చారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ముగ్గురు బిడ్డలు, కుమారుడు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు బోయిని గోపాల్, బీజేపీ నాయకుడు మల్కయ్య, చిన్ననాటి మిత్రులు పులిందర్‌రెడ్డి, పి.వెంకటయ్య, రవీందర్, శ్రీకాంత్, గువ్వల వెంకటయ్య, ఆశన్న ఉన్నారు.

● అంబేడ్కర్ సంఘం గ్రామ అధ్యక్షుడు గుర్రాల చెన్నయ్య ఆధ్వర్యంలో రూ. 9 వేలను మృతి చెందిన అర్జున్ కుటుంబ సభ్యులకు అందించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ముమ్మాటికీ తెలంగాణ విలీన దినోత్సవమే : సీపీఎం

మహబూబ్‌నగర్ రూరల్, సెప్టెంబరు 18 : సెప్టెంబరు 17 ముమ్మాటికీ తెలంగాణ విలీన దినోత్సవమేనని సీపీఎం నాయకుడు కిల్లే గోపాల్ అన్నారు. బుధవారం మండలంలోని మాచన్‌పల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భాగంగా 1946 జూలై 4న మొదటి అమరవీరుడు దొడ్డి కొమురయ్య మరణంతో సాయుధ పోరాటం ప్రారంభమైదని 1951 సెప్టెంబర్ 17 ముగిసిందని తెలిపారు. ఎంతో మంది అమరుల త్యాగం ఫలితం తెలంగాణ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా, మండల నాయకులు కడియాల మోహన్, హన్మంతు, వి.హన్మంతు, దున్న ఖాదర్, శివలీల, బల్ల కిష్టయ్యగౌడ్, రమేష్, నర్సింహులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు న్యూరిషి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 18 : జిల్లా కేంద్రంలోని రాజేంద్రనగర్‌లో గల న్యూరిషి పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాహుల్ నాయక్ (600 మీటర్ల పరుగుపందెం) పి. రామ్‌కుమార్ (షాట్‌పుట్)లను బుధవారం పాఠశాలలో చైర్మన్ చంద్రకళావెంకటయ్య, డైరెక్టర్ పూజితామోహన్‌రెడ్డి, శిరీషాప్రవీణ్, సాయిసుశాంద్‌కృష్ణ, ప్రిన్సిపాల్ వి.వెంకట్‌రమణ, పీఈటీ విష్ణుకాంత్‌గౌడ్, ఉపాధ్యాయులు అభినందించారు.

రహదారికి మరమ్మతులు

నవాబ్‌పేట, సెప్టెంబరు 18 : మండలంలోని దేపల్లి, భీమారం గ్రామాల మధ్య ఉన్న సుమారు 4 కిలోమీటర్ల రహదారికి దేపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్‌గౌడ్ మరమ్మతులు చేయించారు. రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నందున జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆదేశానుసారం రూ.లక్ష వెచ్చించి మట్టి వేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి చావుకు కారణమైన వారిపై హత్యకేసు

- నాలుగు రోజుల క్రితం వ్యక్తిపై దాడి.. చికిత్సపొందుతూ బుధవారం మృతి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 18 : పట్టణంలోని మోతీనగర్‌కు చెందిన ఓ వ్యక్తిపై కొందరు ఇష్టానుసారంగా దాడి చేశారు. తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చేరిన అతను కోలుకోలేక చనిపోవడంతో పోలీసులు దాడి చేసిన వ్యక్తులపై హత్య కేసు నమోదుచేసి నిందితుల కోసం గాలిస్తున్నారు. టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం ఈనెల 14న రాత్రి సమయంలో మోతీనగర్‌లో నివాసం ఉంటున్న శివలీల ఇంటికి అదే ప్రాంతంలో ఉంటున్న గొల్ల కిష్టయ్య మరికొంతమంది కలిసి వెళ్లారు. పాత కక్షలు మనసులో పెట్టుకుని ఆమెను దుర్భాషలాడుతూ కొట్టగా ఆమె అదే కాలనీలో ఉంటున్న తన సోదరుడు మాతర్ల కురుమూర్తికి విషయం చెప్పి అతన్ని తీసుకుని వస్తుండగా, వాళ్లే కురుమూర్తి ఇంటివద్దకు వెళ్లి దుర్భాషలాడుతుండగా అతను రాత్రివేళ గొడవలెందుకని నచ్చజెప్పే ప్రయత్నం చేయగా కిష్టయ్య మరికొంత మంది అతనిపై ఇష్టానుసారంగా చేతులతో దాడి చేశారు. ఈ దాడిలో అతను వెల్లకిలాపడిపోగా తల సీసీరోడ్డుకు తగిలి పగలడంతో రక్తస్రావమైంది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. కేసును డీఎస్పీ వెంకటేశ్వర్లు దర్యాప్తు చేస్తున్నారు.

ఓటరు జాబితాలో మార్పులపై మూడు రోజుల్లో తెలపండి

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్



ప్రజా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), సెప్టెంబరు 18 : గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం ఓటరు జాబితాలో చేయాల్సిన మార్పులు, చేర్పులను ఈ నెల 21 లోపు అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ బి.విజయేందిర సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై బుధవారం ఆమె కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా కొత్త ఓటర్లుగా నమోదు చేయడం, ఓటరు జాబితాలో సవరణలు చేయడం వంటివి చేపడతారని, రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కోరారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితాలో సవరణలు, మార్పు, చేర్పులు, జాబితాలో చనిపోయిన వారి పేర్లను, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పు, తప్పులను సరిదిద్దడం వంటివి తమ దృష్టికి తీసుకరావాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా పరిషత్ సీఈవో వెంకట్‌రెడ్డి, డీపీవో పార్థసారథి, కాంగ్రెస్ నుంచి ఎం.డి. ఇద్రిస్, బీజేపీ నుంచి బురుజు రాజేందర్‌రెడ్డి, సీపీఐ నుంచి బాలకిషన్, సీపీఎం నుంచి రాజ్‌కుమార్, టీడీపీ నుంచి చంద్రశేఖర్ సమావేశంలో పాల్గొన్నారు.

అక్టోబరు 1 న వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించాలి

అక్టోబరు 1న వయోవృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆ రోజున ప్రభుత్వ ఆసుపత్రిలో వయోవృద్ధులకు ప్రత్యేకంగా చికిత్సలు అందించాలని అన్నారు. అలాగే ప్రతీ గురువారం ప్రత్యేకంగా వృద్ధులకు చికిత్స అందించేలా ఏర్పాట్లు చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. అలాగే మతిమర్పు సమస్యలు ఉన్న వృద్ధులకు ఒక గుర్తింపు కార్డులను వారికి కేటాయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి మండలంలో మండల స్థాయి సీనియర్ సిటిజన్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్పీ జానకి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఆర్‌డీవో పీడీ నర్సింహులు, ఆర్డీవో నవీన్, జిల్లా వైద్యాధికారి పద్మ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, జిల్లా స్థాయి సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు నాగేంద్ర స్వామి, జగపతిరావు, పవన్ కుమార్, నరసింహులు, అధికారులు పాల్గొన్నారు.

మేదరుల అభివృద్ధికి అన్ని విధాలా పాటుపడుతాం

- మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్



ప్రపంచ వెదురు దినోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు, సెప్టెంబరు 18 : మేదరుల అభివృద్ధికి అన్ని విధాలుగా పాటుపడుతామని మహబూబ్‌నగర్ మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీకేతేశ్వరస్వామి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే యెన్నంతో మాట్లాడి విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, డీసీసీ జనరల్ సెక్రటరీ సిరాజ్‌ఖాద్రీ, మేదరి సంఘం పెద్దలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో మేదరులకు ప్రాధాన్యం : మాజీ మంత్రి

బీఆర్‌ఎస్ హయాంలో మేదరులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని మాజీ మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి పాల్గొన్నారు. మేదరి సంఘం భవనానికి స్థలంతోపాటు పేదలకు రెండు పడక గదుల ఇండ్లు ఇచ్చామన్నారు. పదేళ్లలో మహబూబ్‌నగర్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పదినెలలైనా అభివృద్ధి చేయలేదన్నారు. 523 సర్వేనెంబర్ పేదల పక్షాన పోరాటం చేసినందుకు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ కే.సి నరసింహులు, గంజి వెంకన్న, ఆంజనేయులు, టి.గణేష్, రామలక్ష్మణ్, సాయిలు, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, కిషన్, పవర్, వెంకట్రాముడు, రాజేందర్, సత్యం, యువత పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి క్రీడల్లో రాణించాలి

- మండల స్థాయి ఆటలపోటీల ప్రారంభంలో ఎమ్మెల్యే జీఎంఆర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర, సెప్టెంబరు 18 : ప్రతీ విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో పాల్గొనేలా ఆడాలని సూచించారు. ప్రతీ విద్యార్థి కూడా కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడల పట్ల ఎంతో శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు. తొందరలోనే మండలస్థాయి ఆటల్లో సీఎంకప్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మండల పరిధిలోని బస్వాయపల్లి కాంగ్రెస్ యువనాయకుడు శ్రీనివాస్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం ఆయన దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, మండల నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాంపాండు వేణుగోపాల్‌రెడ్డి, ఆది హన్మంతురెడ్డి, అంజన్‌కుమార్‌రెడ్డి, ఫారుక్‌అలీ, గోవర్ధన్, కొన్న రాజశేఖర్, వివిధ గ్రామాల పాఠశాలల ఉపాధ్యాయులు బాలరాం, జగదీశ్వర్, ఎంఆర్‌సీ శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో లిఫ్ట్‌ను రిపేర్ చేయించాలి

జడ్చర్ల, సెప్టెంబరు 18 : జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మొరాయిస్తున్న లిఫ్ట్‌ను వెంటనే రిపేర్ చేయించాలని డీఎంహెచ్‌వోను జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి కోరారు. ఆసుపత్రిలో రోగులు, సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన లిఫ్ట్ కొద్దిరోజులుగా పని చేయడంలేదన్న సమాచారం అందుకున్న ఎమ్మెల్యే, ఆ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో ఆరా తీశారు. ఆసుపత్రిలో రెండు లిఫ్ట్‌లు ఉండగా, ఇది వరకే ఒక లిఫ్ట్ పనిచేయకపోవడం, డయాలసిస్ విభాగంలో ఉన్న మరో లిఫ్ట్ సైతం బుధవారం మొరాయించిన విషయం ఎమ్మెల్యే దృష్టికి ఆసుపత్రి సూపరింటెండెంట్ వివరించారు. లిఫ్ట్‌లను మరమ్మతులు చేసే ఆసుపత్రి వార్షిక కాంట్రాక్ట్ పొందిన సంస్థకు తెలిపినా, స్పందించడం లేదని ఎమ్మెల్యేకు వివరించారు. లిఫ్ట్‌లు లేని కారణంగా రోగులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని, లిఫ్ట్‌లను వెంటనే రిపేర్ చేయించాలని డీహెచ్‌ఎంవోను ఎమ్మెల్యే కోరారు.

భూకబ్జాపై విచారణ చేయండి

- తహసీల్దార్‌ను ఆదేశించిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మిడ్జిల్, సెప్టెంబరు 18 : మండలంలోని వాడియాల గ్రామంలో బిస్మిల్లాబీకి చెందిన భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం బిస్మిల్లాబీ జడ్చర్లలో ఎమ్మెల్యేను కలిసి తన భూమిని, ఇంటిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఆమె ఎమ్మెల్యేనుకలిసి వినతిపత్రం అందజేశారు. బిస్మిల్లాబీ కుటుంబీకులకు సర్వేనెంబర్ 92అ లో 11 ఎకరాల 28 గుంటల భూమి ఉన్నట్లు ఎమ్మెల్యేకు వివరించారు. 30 ఏళ్లుగా హైదరాబాద్‌కు బిస్మిల్లాబీ వెళ్లడంతో భూమికి సంబంధించిన వారు మృతి చెందారని అధికారులను నమ్మించి భూమిని ఇతరుల పేరుమీదకు మార్చారని ఎమ్మెల్యే ముందు ఆవేదన వ్యక్తం చేశారు. తనకున్న ముగ్గురు కుమార్తెలకు భూమి ఒక్కటే ఆధారమని రోదించింది. వెంటనే ఎమ్మెల్యే స్పందించి మిడ్జిల్ తహసీల్దార్ రాజునాయక్‌కు ఫోన్ చేసి బిస్మిల్లాబీ భూమి విషయంలో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధితురాలికి న్యాయం చేయాలని ఆదేశించారు.

వివేకానంద యువజన వినాయక కమిటీ ఎన్నిక

మూసాపేట, సెప్టెంబరు 18 : మండంలోని సంకలమద్ది ఆంజనేయస్వామి ఆలయం వద్ద గ్రామపెద్దలు, యువకులు సమావేశమై వివేకానంద యువజన వినాయక కమిటీని రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా గట్టు శ్యామ్‌సుందర్‌గౌడ్, కోశాధికారిగా మేకల సురేందర్, కార్యవర్గ సభ్యులుగా కె.శివకుమార్‌రెడ్డి, ఎస్.నవీన్ కుమార్, ఎం.డీ సాదిక్ తదితరులను ఎన్నుకున్నారు.

21లోగా అభ్యంతరాలపై ఫిర్యాదు చేయాలి

జడ్చర్ల, సెప్టెంబరు 18 : జడ్చర్ల మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికలు-2024 ఓటరు ముసాయిదా జాబితాను నోటీసు బోర్డుల లో ప్రకటించడం జరిగిందని, అభ్యంతరాలుంటే ఈ నెల 21లోగా లిఖితపూర్వకంగా ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని బుధవారం ఎంపీడీవో విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 28న గ్రామపంచాయతీ ఓటరు జాబితాను ఫైనల్ లిస్ట్‌ను ప్రకటిస్తారని పేర్కొన్నారు.

నేడు ఓటర్‌లిస్ట్ సందేహాలపై సమావేశం

కోయిలకొండ, సెప్టెంబరు 18 : పంచాయతీ రాజ్ ఓటర్ లిస్ట్ సందేహాలపై అన్ని రాజకీయ పార్టీల నాయకుల సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కాళప్ప ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ఓటర్‌లిస్ట్‌లో సందేహాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకరావాలని కోరారు. మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి

గండీడ్, సెప్టెంబరు 18 : విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల పాఠశాల హెచ్ఎం జనార్దన్ అన్నారు. పాఠశాలలో రెండ జత యూనిఫాం దుస్తులను విద్యార్థులకు అందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ ఎం.రాములు, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, కృష్ణయ్య ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఎమ్మార్పీఎస్ సమావేశం

పాలమూరు, సెప్టెంబరు 18 : 20వ తేదీన ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాసు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసరంగా సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు, అనంతరం సంఘం పరంగా చేపట్టాల్సిన కర్తవ్యాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్, మాదిగ సంఘాల జేఏసీ నాయకులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

చదరంగం పోటీల్లో తిర్మలాపూర్ విద్యార్థికి గోల్డ్ మెడల్



బాలుడు హరి

రాజాపూర్, సెప్టెంబరు 18 : ఈ నెల 16, 17 తేదీలలో హైదరాబాద్ బాచు పల్లిలో జరిగిన స్పోర్ట్స్ చాంపియన్ కార్నివాల్‌లో 2024 చదరంగం చాంపి యన్‌షిప్‌లో మండలంలోని తిర్మలాపూ ర్ గ్రామానికి చెందిన విద్యార్థి బంగారు పతకం సాధించాడు. జడ్చర్ల సమీపం లోని కేశవరెడ్డి పాఠశాలలో చదువు తున్న మలగల హరి స్టేట్ జూనియర్ చదరంగం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించాడు. గ్రామం లోని యువజన సంఘాల సభ్యులు, యువకులు బాలుడిని అభినందించారు.

మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 18 : ఆత్మరక్షణ కోసం మార్షల్ నేర్చుకోవాలని వీరన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ అన్నారు. బుధవారం వీరన్నపేట పాఠశాలలో బాలికలకు కరాటే తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు ప్రభుత్వం ప్రత్యేక కరాటే శిక్షణ తరగతులను నిర్వహిస్తుందని తెలిపారు. బాలికలలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, రాంప్రసాద్, శ్రీనివాస్, వీరాచారి, కరాటే మాస్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి ఆల పరామర్శ

మూసాపేట, సెప్టెంబరు 18 : మండలంలోని జానంపేట గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ అనారోగ్యంతో బాధపడుతుండగా బుధవారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి పరామర్శించారు. హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొంది డిచార్జీ అయి ఇంటికి వచ్చిన రామకృష్ణను ఆల పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ యాదవ్, సీనియర్ నాయకులు పల్లి శివరాములు, గూపని కొండయ్య, అనిల్‌రెడ్డి, సత్తార్ ఉన్నారు.

మద్దిగట్లలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మృతి

భూత్పూర్, సెప్టెంబరు 18: మండలంలోని మద్దిగట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లక్ష్మారెడ్డి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు లక్ష్మారెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్ష్మారెడ్డి ఎన్నో సేవలు చేశారని, అకాల మరణం పార్టీకి తీరని లోటని అన్నారు.

రికార్డుల టాంపరింగ్‌పై డీఎల్‌పీవో విచారణ



పోలేపల్లిలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎల్‌పీవో పండరీనాథ్

జడ్చర్ల, సెప్టెంబరు 18 : జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రామపంచాయతీలో రికార్డులు టాంపరింగ్ అంశంపై డీఎల్‌పీవో పండరీనాథ్, ఎంపీవో సరోజలు బుధవారం విచారణ చేపట్టారు. గ్రామపంచాయతీ రికార్డులు టాంపరింగ్ చేసేందుకు ప్రయత్నం జరుగుతుందంటూ జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అనుమానం వ్యక్తం చేస్తూ, చర్యలు తీసుకోవాలన్న ఆదేశాల మేరకు అధికారులు విచారణను ప్రారంభించారు. రెండు నెలలుగా బదిలీపై వెళ్లిన గ్రామ పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్ రికార్డులను నూతనంగా బదిలీపై వచ్చిన గ్రామపంచాయతీ కార్యదర్శికి అప్పగించకపోవడంతో అనుమానాలు మరింత బలపడ్డాయి. నాలుగున్నర సంవత్సరాలలో సుమారు రూ.6కోట్ల ఆర్థికలావాదేవీలు జరగగా, అందులో రూ.1కోటి అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వచ్చాయి. విచారణలో భాగంగా బదిలీపై వెళ్లిన, బదిలీపై వచ్చిన గ్రామపంచాయతీ కార్యదర్శులు శివప్రసాద్, లక్ష్మీనారాయణల సమక్షంలో మొదటగా క్యాష్‌బుక్స్‌ను తనిఖీ చేశారు. గ్రామపంచాయతీలోని అన్ని రికార్డులను క్షుణ్ణంగా తనిఖీలు చేపడ్తామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం

- పీఆర్టీయూ టీఎస్ కమిటీ ఎన్నికలో సంఘం జిల్లా అధ్యక్షుడు



మహమ్మదాబాద్ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన భీమ్‌రెడ్డి, శ్రీనివాసులు

మహమ్మదాబాద్, సెప్టెంబరు 18 : పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడిగా బిభీమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పుట్టి శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా శాఖ అధ్యక్షుడు జి.నారాయణ్‌గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి నారాయణ్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు, అసోసియేట్ అధ్యక్షుడిగా నర్సింములు, మహిళా ఉపాధ్యక్షురాలిగా మంజుల, రేణుక, కార్యదర్శిగా రమేష్, మహిళా కార్యదర్శిగా వనజలత, ఆంజనేయులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు రాజునాయక్, జైపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు విజయానంద్‌రెడ్డి పాల్గొన్నారు.

భూత్పూర్ పీఆర్‌టీయూ (టీఎస్) కార్యవర్గం ఏర్పాటు

భూత్పూర్ : పీఆర్‌టీయూ (టీఎస్) మండల కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా నాయకుడు రఘురాంరెడ్డి సమక్షంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సత్తారు బాలరాజుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా పి.కృష్ణయ్య, ఉపాధ్యక్షులుగా దస్తయ్య, మహిళా ఉపాధ్యక్షులుగా జి.లక్ష్మి, అసోసియేట్ అధ్యక్షులుగా సాయిరాంరెడ్డితో పాటు మరి కొంత మంది సభ్యు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఉపేందర్‌రెడ్డి, ఎన్నికల పరిశీలకులుగా కృష్ణయ్య వ్యవహరించారు. బాలరాజుగౌడ్ మూడుసార్లు మండల అధ్యక్షుడిగా ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని రఘురాం రెడ్డి అన్నారు. వివిధ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జడ్చర్ల మండల అధ్యక్షుడిగా సత్యనారాయణ

జడ్చర్ల : పీఆర్‌టీయూ జడ్చర్ల మండల శాఖ కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాంరెడ్డి, ఉదయ్‌కుమార్, రాజేందర్ గౌడ్‌ల సమక్షంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా రాజీవ్‌రెడ్డి, మోహన్‌రాజు, ఉపాధ్యక్షులుగా భూప్యానాయక్, స్నేహలత, కార్యదర్శులుగా అతియాసుల్తానా, యాదయ్య శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సీల్డ్ కవర్ టెండర్లకు ఆహ్వానం

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), సెప్టెంబరు 18 : గ్రామ పంచాయతీ ఎన్నికలకు బ్యాలెట్ పేపర్లు ముద్రించేందుకు అనుభవం కలిగిన ఆఫ్‌సెట్ ప్రింటింగ్‌ప్రెస్ యజమాను నుంచి సీల్డ్ కవర్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. జిల్లాలోని 441 గ్రామ పంచాయతీల 2వ సాధారణ ఎన్నికలు-2024కు సంబంధించి బ్యాలెట్ పేపర్ ముద్రించేందుకు గతంలో ఈ పనిని చేపట్టిన అనుభవం కలిగిన అర్హులైన ఆఫ్ సెట్ ప్రింటింగ్ ప్రెస్ యజమానుల నుంచి సీల్డ్ కవర్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి మహబూబ్‌నగర్‌లోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో టెండర్ ఫారాలు ఈ నెల 24న మధ్యాహ్నం 2గంటల వరకు లభిస్తాయని తెలిపారు. ఆసక్తి గల వారు ఇందుకు సంబంధించి సీల్డ్ కవర్ టెండర్‌లను ఈ నెల 24వ రోజు సాయంత్రం 5 గంటల వరకు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌లో వేయాలని తెలిపారు. ఈ టెండర్ బాక్స్‌ను మరుసటి రోజు ఉదయం 11గంటలకు రెవెన్యూ అదనపు కలెక్టర్ చాంబర్‌లో తెరుస్తారని తెలిపారు.

వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా పురస్కారాలు

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), సెప్టెంబరు 18 : అక్టోబరు 1న అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో విశిష్ట సేవలందిస్తున్న వయోవృద్ధులు, సంస్థలకు పురస్కారాలు అందజేస్తున్నట్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా సంచాలకులు జరీనా బేగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 25 సాయంత్రం 5 గంటల లోపు హైదరాబాద్ మలక్‌పేటలోని నల్లగొండ క్రాస్ రోడ్ బస్ స్టాప్ పక్కనున్న దివ్యాంగుల సంక్షేమ భవన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారాన్ని వెబ్ సైట్ నుంచి పొందాలని తెలిపారు.

పెండింగ్‌లోని పీఆర్సీ, డీఏ వెంటనే ప్రకటించాలి

మూసాపేట : ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన పీఆర్సీ, డీఏలను వెంటనే ప్రకటించాలని తపస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి కరుణాకర్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండలకేంద్రంతో పాటు వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి మాట్లాడి తపస్ సభ్యత్వ నమోదును చేయించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధానకార్యదర్శి బాబునాయుడు, మండల అధ్యక్షులు రవినాయక్, నాయకులు లక్ష్మీనారాయణ, గంగవీరన్న, ఉపాధ్యాయులు రాఘవేందర్, నర్సింహారెడ్డి, ఆనంద్, గీతా, సుగుణ, శశికళ, రాజు ఉన్నారు.

కపిలేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి పూజలు

భూత్పూర్, సెప్టెంబరు 18: మండలంలోని కప్పెట గ్రామంలో సుమారు 400 ఏళ్ల నాటి కపిలేశ్వరస్వామి దేవాలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి బుధవారం గ్రామస్థులు, భక్తులు పెద్దసంఖ్యలో చేరుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. గ్రామస్థులంతా చందాలు వేసుకున్నారు. కప్పెట గ్రామస్థులు, భజన మండలి భక్తులు పాల్గొన్నారు.

రెండు రోజుల పాటు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), సెప్టెంబరు 18 : గురువారం నుంచి 48 గంటల పాటు మిషన్ భగీరథ నీరు సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మహబూబ్‌నగర్ మిషన్ భగీరథ గ్రిడ్ డివిజన్ కార్యనిర్వాహక అధికారి పుట్ట వెంకట్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి కాలువ తీయడానికి తిమ్మాజిపేట మండలం గుమ్మకొండ వద్ద నాగసాల నీటిశుద్ధి కేంద్రానికి వచ్చే పైపులైన్ అడ్డంగా ఉన్నందున ఆ పైపులైన్ బ్రిడ్జి మీదికి మార్చడం కోసం పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. అందుకని గురువారం ఉదయం 8 గంటల నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకు నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జడ్చర్ల, దేవరకద్ర, మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాలలోని మొత్తం 458 గ్రామాలతో పాటు భూత్పూర్ మునిసిపాలిటీ పూర్తిగా జడ్చర్ల, మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలలో పాక్షికంగా నీటిసరఫరా ఉండదని తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.